# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. తెలంగాణలో 15 ఏళ్లు దాటిన వాహనాలను నిలిపివేసేలా ప్రత్యేక విధానం తీసుకువస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**

**3. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈ నెల 22వ తేదీ వరకు జరగనున్నాయని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.**

**4. తెలంగాణలో ఈ నెల 14 నుంచి కాంగ్రెస్ ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుతామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**

**5. ప్రజా ప్రసార సేవల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్- 2047పై ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ తొలి సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో నిన్న నిర్వహించారు. కమిటీలో సభ్యులుగా ఉన్న పలువురు పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్- 2047కు అవసరమైన విధానాలు, ప్రణాళికలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అవకాశాల కల్పనతో సంపద సృష్టించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచవచ్చని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, మానవవనరులు అందుబాటులో ఉన్నాయని, పారిశ్రామిక రంగంలో వాటి ద్వారా సత్ఫలితాలు సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలను విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో నిన్న జరిగిన జాతీయ విద్యాదినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 164 మంది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయులుగా

ఎంపికైన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్ (35 సెకన్లు)

---

తెలంగాణలో 15 ఏళ్లు దాటిన వాహనాలను నిలిపివేసేలా ప్రత్యేక విధానం తీసుకువస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రవాణాశాఖలో 96 సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ –ఏఎంవీఐ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఆర్టీఏ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి నిన్న నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడమే సంతృప్తి కలిగించిన సందర్భమని చెప్పారు. హైదరాబాద్‌లో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు.

---

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈ నెల 22 వ తేదీ వరకు జరగనున్నాయని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. అమరావతిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈరోజు బడ్జెట్ పై అసెంబ్లీ కమిటీ హాల్‌లో శాసన సభ్యులందరికీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, శనివారం కూడా సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన చర్చ జరపడం సభ్యుల బాధ్యత అని తెలిపారు.

---

తెలంగాణలో ఈ నెల 14 నుంచి కాంగ్రెస్ ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుతామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ విజయాలను, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతి మంచి పనిని ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రవాణాశాఖ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే తెలంగాణ రవాణాశాఖ లోగోను విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకం, పారిశ్రామికాభివృద్ధి సహకారానికి టాటా సంస్థ ఇండియన్ హోటళ్లను ఏర్పాటు చేయనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలురంగాలపై టాటా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధిలో టాటా గ్రూపు ఒక ముఖ్య వాటాదారుగా కొనసాగుతోందన్నారు. విశాఖలో కొత్తగా ఐటీ అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు టీసీఎస్ కట్టుబడి ఉందని, 10 వేల మందికి ఉపాధి కల్పిస్తామని చంద్రశేఖరన్ తెలిపారని అన్నారు. టాటా పవర్ 5 వేల మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా 40 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతోందని, రాష్ట్రాభివృద్ధికి ఈ కార్యక్రమాలు దోహదపడతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---

తెలంగాణలో చలనచిత్ర పరిశ్రమ మరింత వృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరబాద్‌లో జరిగిన తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా భూమి' నుంచి 'బలగం' వరకు తెలంగాణ నుంచి ఎన్నో గొప్ప చిత్రాలు వచ్చాయని అన్నారు. చిత్రపురి కాలనీలో కొత్తగా కట్టబోయే ఫ్లాట్లలో తెలంగాణ కళాకారులకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రజా ప్రసార సేవల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. అహింసా మార్గాన్ని ఎంచుకుని భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనలో ముఖ్య భూమిక పోషించిన మహాత్మా గాంధీ 1947వ సంవత్సరం నవంబర్ 12వ తేదీన తొలిసారి ఢిల్లీలోని ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించారు. గాంధీజీ ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించిన ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా నవంబర్ 12వ తేదీన ప్రజా ప్రసార సేవల దినోత్సవాన్ని పాటిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైందని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదం చేస్తుందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఎంపీ తెలుపుతూ,

...వాయిస్.. 33 సెకన్లు

---------------------------

పండుగలను పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని గుంతకల్లు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు మీదుగా ఆరు ప్రత్యేక రైళ్లు నడపనున్నామని వెల్లడించారు. ఎస్ఎంవీటీ బెంగళూరు-బరౌని-ఎస్ఎంవీటీ బెంగళూరు, యశ్వంతపూర్-ముజఫర్‌పూర్-యశ్వంతపూర్, యశ్వంతపూర్-దానాపూర్-యశ్వంతపూర్ ప్రత్యేక రైళ్లు ఈరోజు నుంచి ఈ నెల 24 వరకు వివిధ తేదీల్లో నడుస్తాయని పేర్కొన్నారు.

---------------------------

ప్రసార మాధ్యమాల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శాసనమండలి సభ్యులతో ఆయన తాడేపల్లిలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రశ్నిస్తామనే వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్షహోదా ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్సీలు ప్రభుత్వ విధానాలపై శాసన మండలిలో చర్చించాలని జగన్‌మోహన్ రెడ్డి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ డిసెంబర్ 5వ తేదీన జరగనుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ నెల 18 వరకు నామినేషన్ల స్వీకరణ, 19న నామినేషన్ల పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు తుది

గడువు నిర్ణయించింది. డిసెంబర్ 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి నిన్న శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూజివీడు నియోజకవర్గంలో 20 కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. 35 లక్షల రూపాయలతో కొత్త రావిచర్ల, పాత రావిచర్ల గ్రామాల్లో కచ్చా రహదారుల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశామని వీటిని త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

=======================